ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







మనదే విక్టరీ కావాలి..

నీకోసమే చూస్తున్నాం : రావులపాలెం జాతీయ రహదారిపై బాబుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్న అభిమాని



ప్రజాగళమై : రావులపాలెం హైవేపై బాబు రోడ్‌షోకు వెల్లువెత్తిన అభిమానం



కురిసింది పూలవాన : మండపేట రోడ్‌షోలో నమస్కరిస్తున్న చంద్రబాబు



కూటమి అభ్యర్థులను గెలిపించండి : ద్రాక్షారామలో మాట్లాడుతున్న చంద్రబాబు




# నేను మీ వాడిని..

## మీరు వేసే ఓటు.. మీ భవిష్యత్‌కే..

- ప్రజాగళం సభలు సూపర్‌హిట్
- అండగా ఉంటానని బాబు హామీ
- రావులపాలెంలో జగ్గిరెడ్డిపై ఫైర్
- ద్రాక్షారామలో తోట, బోస్‌లపై ఆగ్రహం
- అడుగడుగునా నీరాజనం
- సభా ప్రాంగణాలకు వెల్లువలా జనం
- కూటమిలో సమరోత్సాహం

కాకినాడ, అమలాపురం (ఆంధ్రజ్యోతి)/రావులపాలెం/ద్రాక్షారామ/ మండపేట, ఏప్రిల్ 3: జనం... జనమే జనం... అడుగడుగునా బ్రహ్మరథం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. అధినేత ఆగమనం ఆలస్యం అయినా వేయి కళ్లతో ఎదురుచూశారు.. వైసీపీ పాలనలో దగాపడ్డ తమకు చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏంచేస్తారో చెబితే వినడానికి బారులు తీరారు. వచ్చిన జనాలను చూస్తుంటే తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తోందని ధీమా వ్యక్తంచేశారు. గోదావరి జిల్లా ప్రజలు మంచితనానికి మారుపేరంటూ కొనియాడారు. మంచినీళ్లు అడిగితే కొబ్బరి నీళ్లు ఇచ్చేంత మంచివారు అంటూ వేనోళ్ల పొడిగారు. పూతరేకులు తీయదనం ఇక్కడి ప్రజల మనసుల్లో ఉంటుందంటూ ఈ ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ ప్రజాగళం సభల్లో చంద్రబాబు ప్రసంగించారు. రావులపాలెంలో బుధవారం సాయంత్రం జరిగిన ప్రజాగళం తొలి బహిరంగ సభకు జనం పోటెత్తారు. చంద్రబాబు రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4 గంటల సమయంలో మల్లయ్యదొడ్డిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. కూటమి శ్రేణులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి చంద్రబాబు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్‌షో నిర్వహించారు. అక్కడ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ గజమాలను క్రేన్ సాయంతో చంద్రబాబుకు అలంకరించారు. అనంతరం రావులపాలెం తెలుగుదేశం మండల పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని, చంద్రబాబు పాలన కోసం రాష్ట్రం ఎదురుచూస్తోందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా జగ్గిరెడ్డి తరిమితరిమికొట్టి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిచి చంద్రబాబు కానుకగా అందిస్తానని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. చంద్రబాబునాయుడు 50 నిమిషాలకుపైగా ప్రసంగించారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అవినీతి, అక్రమాలపై చంద్రబాబు మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కోనసీమ ప్రజల గొప్పదనాన్ని గుర్తుచేస్తూ ఈ ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. అన్ని స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కోనసీమ జిల్లాలో అధికార వైసీపీ అరాచకాలపై చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీ దగ్గర నుంచి మట్టి మాఫియా వరకు ఏకరువు పెట్టారు. మంత్రి వేణు చెల్లని కాసు అని మండిపడ్డారు. తన పదవిని కాపాడుకునేందుకు వైవీ సుబ్బారెడ్డి కాళ్లపై పడి బీసీల పరువు మంటగలిపారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని అడ్డంగా దోచుకుతిన్నారని నిప్పులుకక్కారు. తీరా ఎన్నికల ముందు పక్క నియోజకవర్గానికి బదిలీ అయి వెళ్లిపోయారు. ఇక్కడున్న ఎంపీ బోస్‌పైనా చంద్రబాబు ధ్వజమెత్తారు. తోట త్రిమూర్తులు గురించి మాట్లాడుతూ ఇక్కడ ఉండే వ్యక్తి పక్క నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దళితు లకు శిరోముండనం చేసిన వ్యక్తి ఆయన అంటూ మండిపడ్డారు. జిల్లాలో దళితులను ఎందరినో వైసీపీ పొట్టనపెట్టు కుందని చంద్రబాబు నిప్పులు కక్కారు. కాకినాడలో తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును పక్కన పెట్టుకున్న జగన్ దళితులను ఏం ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. ఆయనకు ఊరేగింపులు కూడా వైసీపీ నేతలు చేశారంటే ఎంత కండకావరం అని ప్రశ్నించారు.






రావులపాలెం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

### కోటిపల్లి రైల్వేలైన్ పూర్తి చేస్తాం...

కోనసీమ జిల్లా అంటే బాలయోగి. ఈ ప్రాంతం కోసం ఆయన కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ సాధించారు. కానీ వైసీపీ వచ్చాక కేంద్రం ఇచ్చిన నిధులకు రాష్ట్రం తన వాటా నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టును నీరుగార్చింది. అందుకే బాలయోగి కల నెరవేర్చేలా టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఓఎన్జీసీ పైపు లైను వల్ల మత్స్యకారులకు నెలకు రూ.11 వేల చెల్లింపును టీడీపీ వస్తే ఆపేస్తుందని వైసీపీ ప్రచారం చేస్తోంది. కానీ దీన్ని ఎవరూ నమ్మొద్దు. అవసరమైతే నష్టపరిహారం పెంచేలా చర్యలు చేపడతామన్నారు. గోదావరి కాలువల ఆధునికీకరణ, ఏటిగట్ల పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని రహదారులను బాగు చేస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందిందని ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రావులపాలెంలో ప్రసంగం పూర్తి చేసుకున్న చంద్రబాబు రోడ్డుమార్గంలో జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు, మండపేట, మాచవరం, పసలపూడి మీదుగా రామచంద్రపురం చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ రోడ్డుషో నిర్వహిస్తూ సరిగ్గా రాత్రి 9.08 గంటలకు ద్రాక్షారామ చేరుకున్నారు. చంద్రబాబు తన ప్రసంగంలో రామచంద్రపురం అసెంబ్లీ అభ్యర్థి సుభాష్ మంచివాడని.. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడతాడన్నారు. ఎంపీ అభ్యర్థి హరీష్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నేతలు చంద్రబాబుకు నాగలి అందించారు. ముస్లింలు టోపీ అలంకరించారు. చంద్రబాబు రాత్రి పది గంటలకు రామచంద్రపురంలోని వీఎస్‌ఎం కాలేజీలో బసకు చేరుకున్నారు .గురువారం ఉదయం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేతలు, అభ్యర్థులతో సమీక్ష నిర్వహించను న్నారు. రావులపాలెంలో తొలుత హెలిపాడ్ వద్ద తెలుగు మహిళ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి చంద్రబాబుకు హారతిచ్చి స్వాగతం పలికారు. టీడీపీ నేతలు వేగుళ్ల జోగేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు, జనసేన పి.గన్నవరం అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, నాయకులు రేవు శ్రీను, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టేకుమూడి సత్యనారాయణ, చిక్కాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

### నేడు చంద్రబాబు టూర్ ఇలా..

రాజమహేంద్రవరం ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబునాయుడు గురువారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రజాగళం యాత్రలు నిర్వహించనున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా ఏర్పడి అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. కొవ్వూరులో సాయంత్రం 4 గంటలకు, గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో 6 గంటల జరిగే ప్రజాగళం సభల్లో ప్రసంగిస్తారు. రాత్రికి నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో బస చేసి శుక్రవారం ఉదయం పార్టీ నేతలతో సమావేశమవుతారు. అనపర్తి సమస్యతో పాటు జిల్లాలో అక్కడక్కడా ఉన్న అసంతృప్తనేతలను బుజ్జగించే అవకాశం ఉంది. అనంతరం బాబు నరసాపురం వెళతారు.



నువ్వు రావాలయ్యా : ద్రాక్షారామలో జనం జేజేలు



బాబు వస్తారని : రామచంద్రపురంలో మహిళల వెయిటింగ్



దారంతా అభిమానమే : రావులపాలెంలో బాబు కోసం వచ్చిన మహిళలు




కదిలొచ్చిన పసుపు దండు : రావులపాలెంలో బహిరంగ సభ వద్ద మహిళలు



ఇదీ మా స్పెషలండీ..అయ్ : చంద్రబాబుకు పూతరేకుల జ్ఞాపిక

రావులపాలెంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇసుక దోపిడీపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ఆలోచింపజేసింది.






రోడ్డుపై నిలిపివేసిన గీత కాన్వాయ్.. ట్రాఫిక్‌లో పశు అంబులెన్స్

## రోడ్డుపై కాన్వాయ్ నిలిపివేసిన వంగా గీత

### ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన పశు అంబులెన్స్

గొల్లప్రోలు రూరల్,ఏప్రిల్3: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా వైసీపీ నేతలు తమ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. నడిరోడ్డుపై తమ వాహనాలు నిలిపివేసి ట్రాఫిక్‌జామ్‌తో ప్రజలు అగచాట్లు పడుతున్నా పట్టనట్టు వ్యవహరించారు. అదే మార్గంలో వస్తున్న పశు అంబులెన్స్ గంటకు పైగా నిలిచిపోయింది. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం సాయంత్రం పిఠాపురం వైసీపీ అభ్యర్థి, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఎంపీతో పాటు ప్రచారానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కోసం ఎదురుచూపులు చూశారు. గంటపాటు రోడ్డుపైనే వాహనాలు ఉండిపోవడంతో చెందుర్తి రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. కాకినాడలో చెందుర్తి గ్రామస్తుడు దేవర ఆదినారాయణకు చెందిన గేదెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయించి పశు అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా కాన్వాయ్ రోడ్డుపై ఉండడంతో అంబులెన్స్ గంటపాటు నిలిచిపోయింది. గంట తర్వాత అంబులెన్స్ ముందుకు కదిలింది. అటు వెళ్లేవారంతా ఇబ్బందులు పడ్డారు.

## ఏడి 'పింఛెన్'

- సచివాలయాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- మధ్యాహ్నం వరకూ రాని నగదు
- అదీ అరకొరగానే నిధుల విడుదల
- జిల్లాలో 37 శాతం మందికే అందిన పింఛన్లు

పిఠాపురం/గొల్లప్రోలు/కాకినాడరూరల్/సామర్లకోట/పెద్దాపురం/ఏలేశ్వరం/గండేపల్లి/కిర్లంపూడి/రౌతులపూడి/తాళ్లరేవు, ఏప్రిల్ 3: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు వక్రభాష్యం చెబుతూ ప్రతిపక్షాలపై బురద రాజకీయం ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది. ఉదయం 9 గంటల నుంచే సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పినా మధ్యాహ్నం వరకూ నగదును విడుదల చేయలేదు. తర్వాత సర్దుబాటు చేసినా అరకొరగానే. దాంతో 37 శాతం మందికే పింఛన్లు అందాయి. జిల్లావ్యాప్తంగా కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, గొల్లప్రోలు, ఏలేశ్వరం పట్టణాలతోపాటు అన్ని మండలాలు కలిపి 2,81,370 మందికి పింఛన్ల రూపేణా రూ.83.39 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రతి నెలా వలంటీర్ల ద్వారా అందిస్తుండగా, ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఆ బాధ్యతల నుంచి తప్పించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇక్కడే వైసీపీ రాజకీయానికి తెరలేపింది. ఇంటింటికి పింఛన్లు అందిస్తుంటే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కుట్ర పన్ని ఇవ్వకుండా చేశాయని ప్రచారం సాగించింది. సచివాలయ ఉద్యోగులు ద్వారా ఇంటింటికి పింఛను అందించే అవకాశం ఉందని టీడీపీ, జనసేన తదితర పార్టీలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల కమిషన్‌కు తెలిపినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. మరోవైపు తమ వద్ద నిధులు అందుబాటులో లేని విషయాన్ని కప్పి పుచ్చి టీడీపీ, జనసేన కారణంగా పింఛన్లు పంపిణీ ఆలస్యమవుతున్నట్టు కలరింగ్ ఇచ్చింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం నిధులను మాత్రం విడుదల చేయలేదు. తీరిగ్గా మధ్యాహ్నానికి పురపాలక సంఘాలు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు అరకొరగా నిధులు సర్దుబాటు చేశారు. ఉదయం 9 గంటలకే పింఛన్లు అందిస్తారనే సమాచారంతో జిల్లాలోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల వద్దకు వృద్ధులు, మహిళలు, వికలాంగులు సహా అన్ని రకాల లబ్ధిదారులు చేరుకున్నారు. ఉదయం 11 గంటల వరకూ సచివాలయాలు తెరుచుకోలేదు. జిల్లాలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు అన్ని పట్టణాలు, మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నడవలేక ఇతరుల సహాయంలో సచివాలయాల వద్దకు చేరుకుని పడిగాపులుపడ్డారు. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో తీవ్ర అగచాట్లు పడ్డారు. ఉక్కపోతతో సతమతమయ్యారు. నిధులు ఇంకా బ్యాంకు ఖాతాలకు రాలేదని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో పలువురు ఊసూరుమంటూ వెనుతిరిగారు. మరికొందరు అక్కడే అరుగులు, చెట్లు నీడన ఎదురుచూస్తూ ఉండిపోయారు. మధ్యాహ్నం తర్వాత ప్రభుత్వం నిధులను విడుదల చేయడంతో పంపిణీ ప్రారంభించారు. మండలాలు, పట్టణాలు, నగరాల వారీగా విడుదల చేయాల్సిన నిధుల్లో కోతపెట్టి జమచేసినట్టు సమాచారం. మిగిలిన నిధులను గురువారం జమచేస్తామని సమాచారం ఇచ్చారని కొందరు అధికారులు తెలిపారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు తదితరులకు ఇంటి వద్దకే సచివాలయ ఉద్యోగులు వచ్చి పింఛన్లు అందిస్తారని ప్రభుత్వం ప్రకటించినా ఆ సమాచారం లబ్ధిదారులకు చేరలేదు. దీంతో 90 ఏళ్లు దాటిన వృద్ధులు కూడా సచివాలయాలకు వచ్చారు. గొల్లప్రోలుకు చెందిన కొశిరెడ్డి వెంకట్రావు అనే 92 ఏళ్ల వృద్ధుడు ఉదయం 9 గంటలకే సచివాలయం వద్దకు చేరుకోగా, తెరవకపోవడం, నిధులు రాలేదని చెప్పడంతో నిరాశతో వెనుతిరిగారు. పలువురు నడవలేక రిక్షాలు, ఇతర వాహనాలపై సచివాలయాలకు చేరుకోవడం కనిపించింది. సామర్లకోటలో సాయంత్రం నాలుగు గంటల తర్వాత పంపిణీ ప్రారంభించగా, ఏలేశ్వరంలో సాయంత్రం 5 గంటలకు బ్యాంకు నుంచి కొంత నగదు తెచ్చి పంపిణీ చేశారు. మరో మూడు రోజులపాటు పంపిణీ కొనసాగుతుందని లబ్ధిదారులకు చెప్పారు. గండేపల్లిలో ఉదయం నుంచి పింఛనుదారులు పడిగాపులు పడగా, సాయంత్రం ఐదు దాటాక కొంతమేర పంపిణీ చేశారు. కిర్లంపూడి, తాళ్లరేవు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. పెద్దాపురంలో మధ్యాహ్నం దాటిన తర్వాత గ్రామాల్లో పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. ఓ ఎండలు మండిపోతుండడంతో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల వద్ద పడిగాపులు పడ్డారు. రౌతులపూడి మండలంలో కొందరు వలంటీర్లు లబ్ధిదారులకు ఫోన్లు చేసి పింఛన్లు అందాయా అని ఆరా తీశారు.



గొల్లప్రోలు వార్డు సచివాలయం-6 వద్ద వృద్ధులు, మహిళల పడిగాపులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

## ఎన్నికల్లో తనిఖీ బృందాలు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల్లో తనిఖీ బృందాలైన ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్‌లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. నివాస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఈ బృందాల పనితీరు, సీజర్ మేనేజ్‌మెంట్, ఎంసీసీ, సీవిజిల్ యాప్ ఫిర్యాదులు వాటి పరిష్కారంపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డిలతో కలిపి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ఈ బృందాల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఎన్నికల్లో అక్రమాలపై వచ్చే ఫిర్యాదులపై బృందాలు తక్షణమే స్పందించి దాడులు చేయాలన్నారు. సీజర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు, బృందాలు ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ భాస్కర్‌రావు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాటకం

## ప్రతిపక్షాలపై కుతంత్రం




(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టార్గెట్ టీడీపీ.. ఇదే వైసీపీ పాలకులు అధికార దండం పట్టుకున్న నాటి నుంచీ సాగుతున్న రాజకీయ కక్ష కథా చిత్రమ్. సంఘటన ఏదైనా టీడీపీపై బురద జల్లడం ఒకటే అంతిమంగా జగన్ లక్ష్యం. ఈ జాడ్యం చివరికి అవ్వాతాతలను కూడా వదల్లేదు. వైసీపీ నాయకులు తమ రాజకీయ స్వలాభం, ఓట్లు రాబట్టుకోవడానికి నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లను వినియోగించడం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో ప్రభుత్వ పథకాల పంపిణీకి వారిని ఎన్నికల సంఘం దూరం పెట్టింది. ఇది కచ్చితంగా పాలకులు చేసిన పాపమన్న విషయం జగద్విదితమే. అయితే దీనిని కూడా రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకొని టీడీపీ బురద జల్లే రాజకీయ కుట్రకు జగన్ ప్రభుత్వం తెరతీసింది. ఉద్దేశపూర్వకంగానే పింఛను లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టి ఆ నెపం టీడీపీపైకి నెట్టేయాలనుకొంది. ఈ తంతులో భాగంగా పింఛన్ల పంపిణీని కావాలనే ఆలస్యం చేసింది. ప్రభుత్వ ఖజానాలో సొమ్ములు లేవన్న అసలు నిజాన్ని మాత్రం దాచిపెట్టింది. నిజాలను ఫ్యాను గాలితో ఆర్పేసే ప్రయత్నం చేసింది. అయితే పింఛన్ల పంపిణీ తొలి రోజు అయిన బుధవారం అసలు విషయం నిగ్గు తేలింది. ఏలికల కుట్ర తేటతెల్లమైంది.

- వైసీపీ పింఛను డ్రామా
- 'ఖాళీ' జేబును దాచిపెట్టి
- టీడీపీపై బురద జల్లే కుట్ర
- వృద్ధులతోనూ పాలకుల ఆటలు
- ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో
- సచివాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు
- ఉద్యోగులదీ అదే పరిస్థితి
- బుధవారం సాయంత్రానికి 'తూర్పు' 39 శాతం..
- కోనసీమ జిల్లాలో 24 శాతం..
- కాకినాడ జిల్లాలో 37 శాతం మందికి
- పింఛన్ల పంపిణీ
- సమాచారం లేక లబ్ధిదారుల ఇబ్బందులు

### ఖాళీ జేబును దాచి..

పింఛన్ల పంపిణీ విషయంలో ప్రభుత్వం తన ఖాళీ జేబును దాచి పెట్టిందనే విషయం పింఛన్ల పంపిణీ తొలి రోజునే బయటపడింది. వాస్తవానికి ఐదేళ్ల నుంచీ ఆర్థిక క్రమ శిక్షణ గాడితప్పడంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దీంతో తెల్లారగానే జోలి పట్టుకొని రుణాని కి పరుగులు పెట్టడం అలవాటుగా మారిపోయింది. ఏ పూట రుణం పుడితే ఆ పూట గడుపుతూ పాలన సాగిస్తున్నారు. చివరికి ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వడానికీ ప్రభుత్వం వద్ద పైసలు లేని పరిస్థితిని చూసి వైసీపీ పాలన తీసుకొచ్చిన గొప్ప సంస్కరణగా చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో మార్చి 16 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. దీంతో ప్రభుత్వానికి అప్పులు పుట్టడం కష్టమైంది. ఆ విషయాన్ని దాచిపెట్టి ఆర్థిక సంవత్సరం చివరి రోజు, బ్యాంకులకు సెలవు, సర్వర్లు పనిచేయవు, సాంకేతిక కారణాలు అంటూ రకరకాల అవాస్తవాలను తెరపైకి తెచ్చారు. ఏప్రిల్ 1న పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి ముందే తెలుసు కదా? మార్చి 31న యాన్యువల్ క్లోజింగ్ డే అని తెలియదా? సర్కారు ఖజానాలో సొమ్ము లేదు కాబట్టి ఏదోలా అబద్ధాలు వల్లె వేస్తూ ఏప్రిల్ 3 వరకూ పంపిణీ కార్యక్రమాన్ని నెట్టేశారు. మార్చి నెల చివరిలో వేల కోట్ల రూపా యలు వివిధ పనుల నిమిత్తం కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేసిన ప్రభుత్వం.. పింఛన్ల పంపిణీని మాత్రం వాయిదా వేయడం గమనార్హం.

### అంతా జగన్మాయ..కావాలని చేసిన కుట్ర..?

సామాజిక పింఛన్ల పంపిణీని సైతం జగన్మాయ వీడలేదు. వలంటీర్లను జగన్ తన సొంత సైన్యం మాదిరిగా వినియోగించడంతో పారదర్శకంగా ఎన్నికల నిర్వహించ డంపై ఆ ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం పలు చర్యలు తీసుకొంది. వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి అనుమతించలేదు. దీంతో వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేయాలనే కుట్రతో జగన్ ప్రభుత్వం మైండ్ గేమ్ ప్రారంభించింది. వలంటీర్లు అందుబాటులో లేకపోతే పింఛన్ల పంపిణీ ఇబ్బంది అవుతుందని నమ్మించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. వాస్తవానికి సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపించి పింఛన్లు పంపిణీ చేయించవచ్చు. కానీ ఏదో రకంగా టీడీపీపై పాపం నెట్టేయాలనే ఉద్దే శంతో లబ్ధిదారులను సచివాలయాలకు రావాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి మిన హాయింపునిచ్చింది. గత ప్రభుత్వంలో మునిసి పాలిటీ, పంచాయతీ సిబ్బంది పింఛన్లు అందజేసేవారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందికి వారిని జతచేస్తే సునాయాసంగా ఇళ్లకు తీసుకెళ్లి పింఛన్లు చేతిలో పెట్టవచ్చు. కానీ, ఆ దిశగా పాలకులు అసలు ఆలోచన చేయపోవడమే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జగన్మాయలో భాగంగా పింఛనుదారులను మండుటెండలో సచివాలయాలకు రప్పించి.. ఇబ్బందులకు గురిచేసి.. టీడీపీని భూతంగా చూపించాలనే కుట్ర చేయడం విస్మయాన్ని కలిగిస్తోందంటూ ప్రజలు వాపోతున్నారు.

### తొలిరోజున

తూర్పుగోదావరి జిల్లాలో తొలి రోజున అటు లబ్ధిదారులకు, ఇటు సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం నరకం చూపించింది. 3 నుంచి పింఛన్లు ఇస్తామనడంతో ఉదయం 6 గంటలకే లబ్ధిదారులు ఆదరాబాదరా సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే.. చాలాసేపు ఎదురు చూసినా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. పింఛను సొమ్ములు సచివాలయ సిబ్బంది ఖాతాల్లో ఉదయం 11 గంటల నుంచి నెమ్మదిగా జమ కావడం ప్రారంభమైంది. కొద్దికొద్దిగా జమచేస్తూ వచ్చారు. దీంతో సచివాలయ సిబ్బంది బ్యాంకులకు వెళ్లి డ్రా చేసుకురావడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రాజమహేంద్రవరం నగర పరిధిలోని ఓ సచివాలయ పరిధిలో 137 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారి నిమిత్తం సుమారు రూ.4 లక్షలు సచివాలయ సిబ్బంది ఖాతాలో జమ కావాల్సి ఉంది. అయితే 3న మధ్యాహ్నం 12 గంటల సమయానికి కేవలం రూ.35 వేలు మాత్రమే ప్రభుత్వం నుంచి జమ అయ్యాయి. ప్రతి చోటా ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొన్నారు. దఫదఫాలుగా ప్రభుత్వం జమ చేస్తుండడంతో సచివాలయ సిబ్బంది పరుగులు పెట్టాల్సి వచ్చింది. జిల్లాలో 2,44,730 మంది లబ్ధిదారుల నిమిత్తం సచివాలయ సిబ్బందికి రూ.72,66,98,500 జమ కావాల్సి ఉంది. కానీ బుధవారం సాయంత్రానికి సుమారు 50 శాతం సొమ్ములు అందినట్టు తెలుస్తోంది. అయితే కేవలం 20 శాతం లబ్ధిదారుల చేతికి మాత్రమే పింఛను అందింది. మిగతా వారికి 4, 5, 6 తేదీల్లో అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.



## సముద్రంలో వేటకు అంతరాయం

**61 రోజుల పాటు సముద్ర జలాలలో చేపల వేట నిషేధం..**

**ఈ నెల 15 నుంచి అమలు**

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3 : ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సముద్ర జలాలలో 61 రోజుల పాటు చేపల వేట నిషేధం అమలు కానుంది. ఇందుకు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు) ద్వారా అన్ని రకాల చేపల వేట సాగించరాదు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ జీవో ఆర్‌టీ నెంబర్ 81లో పొందుపరిచింది. వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడం ముఖ్య ఉద్దేశ్యంగా సముద్ర జలాలలో చేపట వేట నిషేధం అమలు చేస్తున్నారు. ఈ నిషేధ ఉత్తర్వులను అనుసరించి సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజ్డ్, మోటారు బోట్లు )పై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాల్సి ఉంది. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట చేసిన బోట్ల యజమానులను ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 ,సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కానున్నారు. వారి బోట్లను, బోట్లలో ఉన్న మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధించనున్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే డీజిల్ ఆయిల్ సబ్సిడీ, అన్ని రకాల సబ్సిడీ సౌకర్యాలను నిలుపుదల చేయనున్నారు. ఈ నిషేధ కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ, కోస్ట్ గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేసింది. అందువల్ల మత్స్యకారులందరూ సముద్ర జలాలలో చేపల వేట నిషేధ కాలంలో సహకరించాలని రాష్ట్ర మత్స్య శాఖ సంయుక్త సంచాలకులు కోరారు.

## తళుక్కుమన్న శ్రద్ధాదాస్



రాజానగరం, ఏప్రిల్ 3: వనమాలి క్రియేషన్స్‌లో కంభంపాటి సంతోష్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న పారిజాత పర్వం మూవీ ప్రమోషన్‌లో చిత్ర యూనిట్ బుధవారం ఐఎస్‌టీఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో చైతన్యరావు, హీరోయిన్ శ్రద్ధాదాస్ కళాశాలలో సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో చైతన్యరావు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లింగ్‌తో కిడ్నాప్ కథ నేపథ్యంలో అందరినీ అలరించేలా సినిమా రూపుదిద్దుకుందని చెప్పారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ గోదావరి అందాలు బాగున్నాయని, ఏప్రిల్ 19న సినిమా విడుదల కాబోతోందని కుటుంబ సమేతంగా సినిమా చూసి ఆదరించాలన్నారు. అనంతరం కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థినులతో కలిసి క్రికెట్ ఆడారు. సినిమాలో సాంగ్స్‌కి డాన్స్ చేస్తూ, డైలాగ్స్ చెప్తూ అందరినీ అలరించారు. తొలుత కళాశాల చైర్మన్ కళ్లం ఉపేందర్‌రెడ్డి సినీ బృందానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ సూరిబాబు, ఏవో ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## 9 గ్యారెంటీలతో కాంగ్రెస్ భరోసా

**రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు**



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 3: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 9 గ్యారెంటీలతో కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ కాటన్ హాలులో బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. చారిత్రాత్మక రాజమహేంద్రవరానికి తాను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే దేశం బాగుపడుతుందన్నారు. సీఎం జగన్ కేంద్రం అమలు చేసిన 18 ప్రజా వ్యతిరేక బిల్లులకు మద్దతుగా నిలిచాడన్నారు. ప్రత్యేక హోదా తీసుకురాలేక పోయాడని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువస్తే దేశం రాష్ట్రం బాగుపడతాయన్నారు. తాను త్వరలోనే లోకల్ మేనిఫెస్టోను తయారు చేస్తానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, ఏఐసీసీ అబ్జర్వర్ మనోజ్‌చౌహన్ ఎస్ఎన్ రాజా, జంగా గౌతమ్, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అరిగెల అరుణకుమారి పాల్గొన్నారు.

## విభజించి..వదిలేశారు..

- ఎక్కడి సమస్యలక్కడే!?.. పుట్టుకొస్తున్న కొత్త సమస్యలు
- నేటితో కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తి
- ఇంకా పూర్తికాని పలు శాఖల విభజన
- కలెక్టరేట్ భవనాలకు కూడా పడని పునాది
- అద్దె ఇళ్లల్లో అధికారులు..శాఖల వారీగా అవస్థలు




తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. కానీ జిల్లాల వారీ కొన్ని శాఖల విభజన కూడా ఇంకా పూర్తికాలేదు. గురువారం నాటికి రెండేళ్లు పూర్తయినా ఇంకా చాలా సమస్యలు పరిష్కారం కాకుండానే ఉండిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఎంతో అట్టహాసంగా పరిపాలన ప్రజల దగ్గర వరకూ తెచ్చేస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకుని జిల్లాల విభజన చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కేంద్రంగా ఉండేది. అక్కడ కలెక్టరేట్ ఉండేది. అందువల్ల కొత్త కాకినాడ జిల్లాకు కలెక్టరేట్ సమస్య లేదు. కానీ కొత్తగా అమలాపురం కేంద్రంగా ఏర్పడిన డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలకు కొత్త కలెక్టరేట్లు నిర్మించలేదు. రాజమహేంద్రవరంలో నేక్ భవనంలో కలెక్టరేట్ నడుస్తోంది. గిరిజన యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎత్తేసి అక్కడ కొత్త జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కొత్తలో కలెక్టరేట్ నిర్మాణానికి స్థలాలు పరిశీలించినట్టు చెప్పారు. కానీ ఇంత వరకూ అవి ఎక్కడనేది ఖరారు చేయలేదు. పనులూ లేవు. మరో జిల్లా అధికార కార్యాలయాలు కూడా పూర్తిగా లేవు. కలెక్టర్ డా. కె.మాధవీలత గతంలో ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లు నివాసంగా వాడుకున్న క్వార్టర్‌నే క్యాంప్ ఆఫీసుగా మార్చుకున్నారు. అక్కడే నివాసం ఉంటున్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు క్వార్టర్లు లేక అద్దె భవనాల్లో ఉంటున్నారు. ఇంకా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల విభజన పూర్తి కాలేదు. వీరికి జిల్లా ఇంజనీరింగ్ అధికారులుగా డిజిగ్నేషన్ ఇచ్చినప్పటికీ అధికారాలు బదిలీ కాలేదు. ఈ శాఖల్లో అధికారులు జిల్లా స్థాయి అధికారులుగా ఉన్నప్పటికీ పనుల కోసం కాకినాడలోని ఎస్ఈలను, కొవ్వూరు డివిజన్ కూడా తూర్పుగోదావరి జిల్లాకి వచ్చింది కాబట్టి అక్కడ పనుల కోసం ఏలూరు ఎస్ఈలను సంప్రదించాల్సి వస్తుంది. జీతాలు కూడా రాజమహేంద్రవరం డివిజన్, రంపచోడవరం డివిజన్ ఇంజనీరింగ్ అధికారులకు ఈ శాఖల అధికారులు ఇక్కడే జీతాలు ఇస్తారు. కొవ్వూరు డివిజన్‌లోని అధికారులు భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా అధికారులు డీడీవోలుగా ఉంటారు. పనులు ఒకచోట, జీతాలు ప్రతిపాదించేది మరొక చోట పెద్దసమస్యగా మారింది. ఏజెన్సీ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి వెళ్లినా ఇంకా లింక్ ఇక్కడే ఉంది. ఎక్సైజ్ విభజన కూడా పూర్తి కాలేదు. ట్రాన్స్‌కోకు ఇంకా రాజమహేంద్రవరమే కేంద్రం. బీసీ, ఎస్సీ కార్పొరేషన్లకు ఇంకా కాకినాడ కేంద్రంగానే నడుస్తున్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ డీఆర్డీవో భవనంలో ఉండగా, ఇతర కార్యాలయాలు కాలేజీల్లో నడుస్తున్నాయి. సొంత భవనాలు ఊసే లేదు. అధికారుల బదిలీలు, ఇతర అంశాలు కూడా ఇంకా కొన్ని ఉమ్మడిగా ఉండడం గమనార్హం. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లు ఉన్న సంగతి తెలిసిందే. అక్కడి పోలీసుల నుంచి ఇతర అధికారులంతా అంతా ఏలూరు కేంద్రం అనుమతితోనే బదిలీలు ఉన్నాయి. ఇతర శాఖల పరిస్థితి అంతే. జిల్లాలు పూర్తి స్థాయిలో విభజన జరిగి, కొత్త జిల్లా అధికారులకు పూర్తి స్థాయి అధికారాలు ఉంటేనే మేలుగా ఉంటుంది. కానీ జిల్లాలను హడావిడిగా విభజించిన వైసీపీ ప్రభుత్వం తర్వాత వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం గమనార్హం.

## పీడీఎస్ బియ్యం పట్టివేత..కేసు నమోదుకు సిఫార్సు



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

తుని రూరల్, ఏప్రిల్3: రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పీడీఎస్ బియ్యం తరలించేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. విజిలెన్స్ అధికారులు పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒక ఆటోలో పీడీఎస్ బియ్యం లోడు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఆటో డ్రైవర్‌ను ఆరా తీసి తనిఖీలు చేపట్టగా చేపూరు గ్రామానికి చెందిన రేషన్ షాపు నెంబరు 4కు హెల్పర్ అయిన కొత్తూరు నరసింహారావు సూచనల మేరకే బియ్యం లోడు చేసుకున్నట్లు డ్రైవర్ తెలిపారు. దీంతో సంబంధిత అధికారులు రేషన్‌షాపులో 4లో తనిఖీలు నిర్వహించగా అవకతవకలు బయటపడ్డాయి. విజిలెన్స్ అధికారుల విచారణలో రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్ పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తేల్చారు. 2650 కిలోల పీడీఎస్ బియ్యం, 87 కిలోల పంచదార, 6 కిలోల గోధుమలు సీజ్ చేసి రేషన్ డీలర్‌తో పాటు ఎండీయూ ఆపరేటర్, ఆటో డ్రైవర్‌లపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేసినట్లు విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజయ్‌కుమార్, సీఎస్‌డీటీ విజయ్ కుమార్, జీవానంద శివ పాల్గొన్నారు.

## ఓటేస్తూ సెల్ఫీలు దిగడం నిషిద్ధం

సామర్లకోట, ఏప్రిల్ 3: పోలింగ్ కేంద్రంలో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో సెల్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగడం లేక ఇతరులకు చూపించడం నిషిద్ధం.. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే నిబంధన 49ఎం (ఓటు రహస్యం) బహిర్గతం నియమం మేరకు ఎన్నికల అధికారులు గుర్తించి ఓటరును బయటకు పంపిస్తారు. ఆ ఓటును నిబంధన 17ఏలో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు. నిబంధన 49ఎం ప్రకారం అంధులైన ఓటర్లు తమ ఓటు వేయడానికి 18 సంవత్సరాలు దాటిన సహాయకుడిని వెంట తీసుకెళ్లవచ్చు. సహాయకుడు అతని ఓటును బహిర్గతపర్చనని నిబంధన 10లో ధ్రువీకరించాల్సి ఉంది.



## గ్రామస్థుల దాడిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొవ్వూరు, ఏప్రిల్ 3: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై భయంతో గ్రామస్థులు దాడి చేయడంతో మృతి చెందాడు. కొవ్వూరు మండలం సీతంపేటలో ఈ దారుణం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని సీతంపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నిక్కరు ధరించి గ్రామంలో ఒక ఇంటిముందు తిరుగుతున్నాడు. ఇటీవల సోషల్ మీడియాలో రాత్రి సమయంలో ఇంటిపై దాడిచేసి దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌కు సంబంధించిన వ్యక్తి అనుకుని ఆ ఇంటిలోని మహిళ ఆకుల నర్సవేణి పెద్ద పెద్ద కేకలు వేసింది. దీంతో గ్రామస్థులు గుమిగూడి ఆ వ్యక్తిపై మూకుమ్మడి దాడి చేశారు. అపస్మారకస్థితిలో కిందపడిపోయిన వ్యక్తిని వదిలిపెట్టి గ్రామస్థులు ఎవరికి వారు వెళ్లిపోయారు. ఉదయం చూసేసరికి అక్కడేపడి ఉన్న వ్యక్తిని చూసి స్థానికులు కొవ్వూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తిని పరిశీలించగా మృతి చెందాడని ధ్రువీకరించారు. దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. చనిపోయిన వ్యక్తికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు రూరల్ ఎస్ఐ 9440796623, సీఐ 9440796621కు సమాచారం అందించాలన్నారు. మద్దూరులంక వీఆర్వో జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.

## వెంకన్న ఆదాయం రూ.2.12 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,12,740 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## ఓటు హక్కుపై అవగాహనకు ర్యాలీ



రంపచోడవరం, ఏప్రిల్ 3: ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి అన్నారు. మహిళా సంఘాలు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో బుధవారం రంపచోడవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేలా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తహశీల్దారు కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా విభూది బ్రదర్స్ కళానాటకం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో డీఎస్‌వీ రమణ, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఐ మోహన్‌రావు, టీడీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు సూరమ్మ, ఇందిరాబామ్, వీఆర్వోలు గణపతి, సీహెచ్ రవి, రమాదేవి, జి.ప్రభాకర్, జి.భూషణం, సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి సీహెచ్ సుధా ప్రకాష్ పాల్గొన్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

## కూటమి అభ్యర్థులను గెలిపించడానికి..

# సమష్టి కృషి చేయాలి

» బీజేపీ ఆత్మీయ సమావేశంలో కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబు



మాట్లాడుతున్న ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి ఉదయ్, చిత్రంలో కొండబాబు, బీజేపీ నాయకుడు కృష్ణమోహన్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3: కాకినాడ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఉదయ్‌శ్రీనివాస్, కొండబాబులను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ సమష్టి కృషిచేయాలని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో కాకినాడ సిటీ నియోజకవర్గ బీజేపీ పదాధికారుల ఆత్మీయ సమావేశం జరిగింది. దీన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడా కృష్ణమోహన్, ఆ పార్టీ నగర అధ్యక్షుడు గట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు ప్రసంగించారు. సమావేశంలో బీజేపీ నగర నాయకులు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పాల్గొన్నారు.

### 'స్వర్ణయుగం తెలుగుదేశంతోనే సాధ్యం'

సామర్లకోట, ఏప్రిల్ 3: రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగ పాలన అందాలంటే అది టీడీపీతోనే సాధ్యపడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ తెలిపారు. సామర్లకోట పట్టణ పరిధిలో 10వ వార్డులో కూటమి పార్టీల నాయకులు తుమ్మల దొరబాబు, విత్తనాల వెంకటరమణ, సరోజావాసు, టీడీపీ పట్టణ నాయకులు తదితర కూటమి పార్టీల నాయకులతో కలిసి టీడీపీ ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాగ్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దాపురం నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో సైకో పాలనకు గుణపాఠం చెప్పాలని కోరారు. ఇంటింటాప్రచారంలో కూటమి పార్టీల నాయకులకు మహిళలు మంగళ హారతులతో నీరాజనాలు పలికారు. అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఐదేళ్లు కనబడని వైసీపీ నాయకులను నిలదీయండి: వర్మ

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 3: ఐదేళ్లపాటు ప్రజల కష్టాలు పట్టించుకోకుండా ఓట్లు ఇప్పుడు వస్తున్న పొన్నూరు ఆడపడుచు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌ను ప్రజలు ప్రశ్నించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో బుధవారం పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో తొలుత ఇక్కడినుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కరెంటు చార్జీల పెంపుతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన పనిలేక చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ, చిట్టూరు సుబ్బారావు పాల్గొన్నారు.

### కూటమిని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధి: నెహ్రూ

గండేపల్లి, ఏప్రిల్ 3: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మురారి గ్రామంలో బుధవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. వైసీపీ అరాచక రౌడీ రాజ్యం ఏలుతోందని ఎద్దేవా చేశారు. నెహ్రూకు మహిళలంతా అడుగడుగునా హారతులిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, సుంకవిల్లి రాజు, యువనాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, కోర్పు సాయితేజ్, గద్దే అప్పన్న, ఉండవిల్లి బుల్లిరాజు, వెంకన్నదొర, బొల్లంరెడ్డి రామకృష్ణ, దాపర్తి సీతారామయ్య పాల్గొన్నారు.

### 'నియోజకవర్గ అభివృద్ధి నెహ్రూతోనే సాధ్యం'

కిర్లంపూడి, ఏప్రిల్ 3: జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూతోనే సాధ్యమని తోట సునీత అన్నారు. బుధవారం కిర్లంపూడిలో మూడోరోజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తూము కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, తూము పెద్ద ఆళ్ల నానాజీ, ఎం.సూరిబాబు, ఎల్లపు దొరబాబు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పవన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న వర్మ



గండేపల్లి మండలం మురారిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నెహ్రూ



సామర్లకోటలో కూటమి నాయకులతో ఇంటింటా ప్రచారం చేస్తున్న రంగనాగ్

### సీసీ కెమెరాలు ఏర్పాటు

జగ్గంపేట, ఏప్రిల్ 3: ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు కాట్రావులపల్లి ప్రధాన కూడలిలో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జగ్గంపేటలోని దేవీ ఫిషరీస్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ నాగార్జునరాజు సీసీ కెమెరాలు ఏర్పాటును పరిశీలించారు.

### కాకినాడ సిటీ కాంగ్రెస్ అభ్యర్థిగా నూకరాజు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3: కాకినాడ సిటీ నియోజకవర్గ కాంగ్రెస్‌అభ్యర్థిగా చెక్కా నూకరాజు పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విడుదలచేశారు. కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన నూకరాజు జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తనకు టిక్కెట్ కేటాయించడంపట్ల నూకరాజు ఏఐసీసీ, పీసీసీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కాకినాడ రూరల్ ప్రాంతానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దాడ సుబ్బారాయుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

### నేడు జిల్లా కాంగ్రెస్ అత్యవసర సమావేశం

ఈనెల 4వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడలోని డీసీసీ కార్యాలయం 'కళా వెంకట్రావ్ భవన్'లో జిల్లా కాంగ్రెస్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు తెలిపారు. దీనికి ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ మల్లిపూడి మంగపతి పళ్లంరాజు విచ్చేస్తారన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దాపురం, ఏప్రిల్ 3: మండలంలోని తిరుపతి గ్రామంలో గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న సామాజిక భవనంలో 50ఏళ్ల పైబడిన ఓవ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పెద్దాపురం సీహెచ్‌సీకి తరలించారు.

### పలు సమస్యలపై కలెక్టర్‌కు ఎస్టీయూ వినతి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 3: పలు సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ జిల్లా ఎస్టీయూ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన కలెక్టర్ జె.నివాస్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా అంగవైకల్యం, మెడికల్, మెటర్నిటీ సెలవులో ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులకు ఎన్నికల విధులనుంచి మినహాయింపునివ్వాలన్నారు. ఉపాధ్యాయులందరికీ కాకినాడ జిల్లా పరిధిలోని ఎన్నికల డ్యూటీ వేయాలని 58ఏళ్లు నిండిన ఉపాధ్యాయులను ఎన్నికల విధులనుంచి తప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్రనాయకులు సత్యనారాయణరాజు, శ్రీను, జిల్లానాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, మహేష్, శ్రీకాంత్, సత్యనారాయణ, ఆనంద్, మణికంఠ పాల్గొన్నారు.

### ఓటుహక్కుపై అవగాహనా ర్యాలీ

పిఠాపురం, ఏప్రిల్ 3: ఓటుహక్కు వినియోగంపై పిఠాపురం పట్టణంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నీ ఓటు మన దేశ అభివృద్ధి వైపు, ఒక్క ఓటు మన భవిష్యత్తును మారుస్తుంది, మీ ఓటుతో పాలకులను మీరే నిర్దేశించండి అంటూ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. నైతిక విలువలు కలిగిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్యపరచడం, భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా అవగాహనా ర్యాలీ నిర్వహించినట్లు పిఠాపురం తహసీల్దారు లక్ష్మి తెలిపారు. మరింత సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1950కి కాల్ చేయాలని కోరారు. ర్యాలీలో ఆర్ఐ వెంకటేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

### 'సమ్మె వేతనాలు మంజూరు చేయాలి'

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 3: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, జీతాలు పెంచాలని సమ్మె చేశామని ప్రభుత్వ ఒప్పందంలో భాగంగా సమ్మె వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, బంగారు రాజేష్ పాల్గొన్నారు.

## బీజేపీ, జనసేన నాయకులపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కేసు నమోదు

» జడ్పీటీసీ నురుకుర్తితోపాటు ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కళ్యాణకృష్ణపైనా కేసు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 3: కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్ శశికాంత్‌నగర్‌లో వైసీపీ ప్రచార సామాగ్రి వాహనాన్ని అడ్డుకున్న బీజేపీ, జనసేన నాయకులపై దాడికి పాల్పడిన సంఘటనలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణతోపాటు ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కురసాల కళ్యాణకృష్ణ తదితరులపై కేసు నమోదు చేసినట్లు సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ, జనసేన నాయకులు కె.రామకృష్ణ, తుమ్మలపల్లి నారాయణరావులు సీఐని కలిసి కేసు నమోదుకు డిమాండ్ చేశారు. దాడి విషయమై ఇరుపార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణతోపాటు ఎమ్మెల్యే కన్నబాబు సోదరుడు కురసాల కళ్యాణకృష్ణ, కడియాల చినబాబు, బెజవాడ సత్యనారాయణ, రాందేవ్ సూర్యప్రకాశరావు తదితరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా ఏ పార్టీల నాయకులను ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. శశికాంత్‌నగర్‌లోని అపార్టుమెంట్‌వద్ద మంగళవారం రాత్రి వైసీపీ ప్రచార సామాగ్రిని దింపుతుండగా ఆ ప్రాంతంలోని బీజేపీ, జనసేన నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామాగ్రి ఉందని భావించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు అక్కడికి చేరుకుని బీజేపీ, జనసేన నాయకులపై దాడి చేసిన సంఘటన తెలిసిందే.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న జనసేన, టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3: కాకినాడ మెయిన్‌రోడ్‌లోని జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ శ్రీనివాస్, కొండబాబు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నెలరోజులపాటు కఠిన ఉపవాసాలు చేస్తున్న ముస్లిం సోదరులకు అల్లా కృప కటాక్షాలు కలగాలన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్కే ఇజాజుద్దీన్, ఎస్కే బాబులు, ఎంఏ తాజుద్దీన్, ఎస్కే రహీం, ఎస్కే ఆలీషా, ఎండీ మసూద్, గబ్బర్‌సింగ్, ఎండీ అన్వర్, ఎండీ ఖాన్, ఎండీ ఖాజా, కసుమూరు, పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, పార్టీ నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గాది శివరామకృష్ణ, చోడిపల్లి సతీష్ పాల్గొన్నారు.

### యువతి ఫిర్యాదుపై అత్యాచారం కేసు నమోదు

కరప, ఏప్రిల్ 3: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్టు కరప పోలీసులు తెలిపారు. కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన యువతిని పిల్లి భీమేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో నమ్మించాడు. గతేడాది జనవరి 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెను లొంగదీసుకున్నాడు. ఆమె గర్భం దాల్చగా తీయించి ఆపై ముఖం చాటేశాడు. పెద్దల్లో పంచాయతీ పెట్టగా యువకుడితోపాటు అతని తల్లిదండ్రులు కట్నం డిమాండ్ చేస్తున్నారని యువతి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితురాలు బుధవారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిపై అత్యాచారం, అబార్షన్, కట్నం వేధింపులు తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గ్రాడ్యుయేషన్ డే

జగ్గంపేట, ఏప్రిల్ 3: జగ్గంపేట శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే జరిగింది. జగ్గంపేట ఎస్ఐ లక్ష్మణరావు, శ్రీచైతన్య పిఠాపురం ప్రాంతీయ ఇన్‌చార్జ్ పి.శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ప్రత్తిపాడు, ఏప్రిల్3: మినర్వా పాఠశాలలో విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. చైర్మన్ ముత్యాల మురళీకృష్ణ, డైరెక్టర్ ఆర్‌బీచౌదరి,ఫౌండర్ డీవీఎస్‌రమేష్ పాల్గొన్నారు.

### పొత్తు ధర్మాన్ని పాటించి పవన్‌ను గెలిపిద్దాం: వర్మ

గొల్లప్రోలు, ఏప్రిల్ 3: టీడీపీ అధినేత చంద్రబాబు సూచనలకు అనుగుణంగా పొత్తు ధర్మాన్ని పాటించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని తన అతిథిగృహంలో బుధవారం చెందుర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, కొడవలి గ్రామాలకు చెందిన బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పొత్తులోభాగంగా టీడీపీకి రావాల్సిన సీటును జనసేనకు ఇచ్చారని తెలిపారు. బీసీలంతా జనసేన సహా పొత్తు పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి జనసేన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జనసేన పార్టీ తెలంగాణా విభాగం అధ్యక్షుడు శంకరగౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, మల్లిపూడి వీరబాబు, కొల్లి బాబూరావు, బేతా సీతారం పాల్గొన్నారు.

### బలభద్రపురం అగ్నిప్రమాద బాధితులకు జ్యోతుల పరామర్శ

జగ్గంపేట రూరల్, ఏప్రిల్ 3: మండలంలోని బలభద్రపురం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్రామానికి చెందిన గోపిశెట్టి సుబ్రహ్మణ్యం, గోపిశెట్టి చిన్నబ్బాయిలకు చెందిన పూరిపాక పూర్తిగా దగ్ధమైంది. రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ వారిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జగ్గంపేట మండల అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కట్టమూరి రామకృష్ణ, మరోతి కృష్ణ, యర్ర పరమేశు పాల్గొన్నారు.

### లారీ ఢీకొన్న ఘటనలో చినశంకర్లపూడి యువకుడి మృతి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 3: యర్రవరం-బూరుగుపూడి జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ఘటనలో ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామానికి లొండా వెంకటరమణ మృతి చెందాడు. మృతదేహానికి ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించడంతో చినశంకర్లపూడిలో అంత్యక్రియలు నిర్వహించారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి నియోజకవర్గ కన్వీనర్ ఏపూరి శ్రీనివాస్, గ్రామస్తులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేశారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఏలేశ్వరం, ఏప్రిల్ 3: రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ రంగారావు, ఏవో జ్యోతి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని, గురువారం నుంచి మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో సత్యనారాణ, పాపారావు, రైతు భరోసా కేంద్ర, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు 'ఆదిత్య'లో జాతీయస్థాయి ప్రో-కార్ట్ రేసింగ్

గండేపల్లి, ఏప్రిల్ 3: జిల్లాలోని గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఈనెల 4వతేదీ జాతీయస్థాయి ప్రో-కార్టింగ్ ఎండురెన్స్ చాంపియన్‌షిప్-24 సీజన్-4 పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడురోజులుగా బ్రేక్ టెస్ట్, ఆటోక్రాస్, స్కిడ్‌పేడ్ తదితర అంశాలు పరిశీలించారన్నారు. గురువారం నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఓవరాల్ ఈవెంట్ విన్నర్‌కు రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు, ఎండురెన్స్ విన్నర్‌కు రూ.85వేలు, ఎండురెన్స్ రన్నర్‌కు రూ.50వేలు నగదు బహుమతితోపాటు జ్ఞాపికలు అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, కోఆర్డినేటర్లు డాక్టర్ శరవణన్, డాక్టర్ భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### టీడీపీలో చేరిన మత్స్యకారులు



దాట్ల బుచ్చిబాబుతో లక్ష్మిపతిపురం మత్స్యకారులు

తాళ్లరేవు, ఏప్రిల్ 3: వైసీపీ పాలనతో విసుగు చెందిన గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం, పెదవలసల మత్స్యకారులు ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. తమ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే అయినా ఓఎన్‌జీసీ కంపెనీ నష్టపరిహారం తప్ప తమకు ఏమీ చేయలేదని మత్స్యకారులు వాపోయారు. టీడీపీలో చేరిన మత్స్యకారులు కొక్కిరిగడ్డ బాబూరావు, వీరబాబు, పాలెపు భైరవస్వామి, రమేష్, వర్మ,కాలాడి వీర్రాజు, తలుకులమ్మ, కర్రి కృష్ణ, లంకే రాజు, కామాడి రాము, పినపోతు తరుణ పార్టీలో చేరారు. పోతాబత్తుల కృష్ణ, బ్రహ్మం ఆధ్వర్యంలో 10మంది మత్స్యకార యువకులకు బుచ్చిబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### ఏలేశ్వరంలో భారీగా టీడీపీలోకి చేరికలు



ఏలేశ్వరంలో టీడీపీలో చేరిన వారితో సత్యప్రభ

ఏలేశ్వరం, ఏప్రిల్ 3: వైసీపీ నుంచి పట్టణంలో భారీగా టీడీపీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్‌లు వరుపుల సత్యప్రభ, వరుపుల తమ్మయ్యబాబు, గంటా బాలు దొర ఆధ్వర్యంలో బుధవారం 20వ వార్డులో జమ్ము లక్ష్మణరావు, గారపాటి పోమరాజు, చింతల అంజి, మరువాడ మధు, శఅలి దేవ, సాయి, పెద్దపూడి ఏసు, చింతల వెంకటరమణ, గారపాటి శివ, ఏసుబాబు, విద్యాసాగర్, నంబారు వరప్రసాద్, తాడి చంద్రశేఖర్, పిల్లి సంతోష్, మామిడి ప్రశాంత్, ముత్యాల వినయతోపాటు 260మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ మాట్లాడుతూ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ రాక్షసపాలనకు ఓటుహక్కు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. జనసేన ఇన్‌చార్జ్ తమ్మయ్యబాబు మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి సత్యప్రభ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీల సమస్యలను సత్యప్రభ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మీ ఇంటికి మీ సత్యప్రభ కార్యక్రమంలో భాగంగా 20వ వార్డులో పర్యటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, పెంద్ర శ్రీను, ఎండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, డాక్టర్ విజయబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ జడ్పీటీసీ సభ్యులు జ్యోతుల పెదబాబు, పెంటకోట శ్రీధర్, పసల సూరిబాబు, పలివెల శ్రీనివాస్, నూకతాటి ఈశ్వరుడు, గట్టెం వెంకటరమణ, గున్నబలత్తుల రాజబాబు, రెడ్డి లోవరాజు, భజంతుల మణి, మామిడి మాధవి పాల్గొన్నారు.

### నిధుల్లేక పెన్షన్లు ఇవ్వలేని దుస్థితి ఇది: జ్యోతుల

జగ్గంపేట, ఏప్రిల్ 2: రాష్ట్రంలో సామాజిక ప్రజాపెన్షన్లు పంపిణీ చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, అంతకుముందే మొత్తం ఖజానాలోని రూ.13 వేల కోట్లు తన అనుయాయులు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యథేచ్ఛగా ప్రభుత్వ ధనాన్ని మళ్లించిన వైసీపీ ప్రభుత్వం చివరకు పెన్షన్లు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ఎలాంటి ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ఉండేందుకు వలంటీర్లను విధుల నుంచి తప్పించి, సచివాలయ ఉద్యోగులకు అప్పగించిందని, నిధులు విడుదల చేయకపోవడంతో వారు పెన్షన్లు పంపిణీ చేయలేదని దుస్థితి ఉన్నారని విమర్శించారు. కానీ ఇదంతా చంద్రబాబునాయుడు, టీడీపీ చేస్తోందని.. వారి వల్లే పెన్షన్లు పంపిణీ చేయడం లేదని సొంత మీడియా అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దాపర్తి సీతారామయ్య, శిలామంతుల వీరబాబు, వెలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ ఎంపీటీసీకి కౌన్సిలింగ్

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 3: పాతకేసుల్లో ఉన్న గొల్లప్రోలు మండలం కొడవలి ఎంపీటీసీ సభ్యుడు బద్ద భగవాన్‌కు ఎస్ఈబీ పోలీసులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అతడ్ని పాత కేసుల నేపథ్యంలో అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి విడుదల చేసినట్లు ఎస్ఈబీ సీఐ గురవయ్య తెలిపారు. గ్రామానికి చెందిన కొప్పిశెట్టి భూరయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

### వలంటీర్ల రాజీనామా

తొండంగి, ఏప్రిల్ 3: మండలంలోని దానవాయిపేట సచివాలయానికి చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శి రాజబాబుకు బుధవారం అందించారు.

### 'ప్రగతి' ఇంజనీరింగ్‌లో వర్క్‌షాప్

గండేపల్లి, ఏప్రిల్ 3: ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 3, 4 తేదీల్లో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం, టెక్నిక్, ఐఐటీ, వారణాసి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఆటోమేషన్ పీఎల్‌సీ అండ్ ఎస్‌సీఏడీఏ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా ఎండీ సయ్యద్, అసదూర్ రెహమాన్, కార్పొరేట్ ట్రైనర్ టెక్నిక్స్, ఐఐటీ, కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవీ హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, వివిధ విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు

గండేపల్లి, ఏప్రిల్ 3: గండేపల్లి వ్యవసాయాధికారి కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సిబ్బంది, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు రబీ ధాన్యం సేకరణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏ హరి మాట్లాడుతూ గురువారంనుంచి ధాన్యం సేకరణ ప్రారంభిస్తున్నామన్నారు. తహసీల్దార్ జె.చిరంజీవిచ ఏవో సద్గురుమూర్తి పాల్గొన్నారు.

### 'ఆదిత్య'లో ముగిసిన సింపోజియం

గండేపల్లి, ఏప్రిల్ 3: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగంలో అద్వితీయ-2కే24 పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ సాంకేతిక సింపోజియం బుధవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన 150మందికి పైగా విద్యార్థులు అనేక రకాల సాంకేతిక పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. కోడ్‌మానియా, స్క్రీన్‌లెస్ కోడింగ్, ఐడియాప్లాజా, టెక్‌ట్రివియా, స్లయిడ్ సెన్సి, పోస్టర్ కోల్లోక్వియం, గేమ్‌స్టోర్మ్ పోటీలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.వానతి, పి.మురళీ, డాక్టర్ టి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

### 'పింఛన్ల పంపిణీపై వైసీపీ విషప్రచారం'

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 3: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికార వైసీపీ తన అనుకూల మీడియా ద్వారా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిపై చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరు రామ్‌కుమార్ కోరారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంతో వలంటీర్లను తాత్కాలికంగా కొన్ని విధులకు దూరం పెట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీని ఇంటింటికీ చేయాలని డిమాండ్ చేశారు.

### మహిళా పారిశ్రామిక పురస్కారం

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 3: కాకినాడలోని ఓ రెస్టారెంట్ యజమాని కాకిలేటి పల్లవికి స్విగ్గీ మహిళాపారిశ్రామికవేత్తల ప్రతిభా పురస్కారం లభించింది. స్విగ్గీ ఆధ్వర్యంలో ఆమె మార్పు-ప్రాంతీయ విస్తరణ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ నుంచి స్విగ్గీ షీ ది చేంజ్‌లో ఆమె అవార్డు అందుకున్నారు.

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి, ఏప్రిల్ 3: మండలంలోని బూరుగుపూడిలో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కిర్లంపూడి ఎస్ఐ జబీర్ తెలిపారు. జగ్గంపేటలోని బాలాజీ రైస్‌మిల్లులో పనిచేస్తున్న లొండా వెంకటరమణ(33) బైక్‌పై చినశంకర్లపూడి వెళ్తుండగా బూరుగుపూడి వచ్చేసరికి వెనుకనుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జగ్గంపేట పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య లొండా వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బంగారు వస్తువుల స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, మార్చి 3: గొల్లప్రోలు మండలం చెందుర్తి-తాటిపర్తి జంక్షన్ల మధ్య ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఉంగరాల అప్పన్నబాబు వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. కారులో బ్యాగులో ఉన్న 61 గ్రాముల పాత బంగారు నగలను అధికారులు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం పిఠాపురం ఏఈఆర్‌వోకు అప్పగించారు.

### 'ఎన్నికల నిర్వహణకు సహకరించాలి'

ప్రత్తిపాడు, ఏప్రిల్ 3: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయపార్టీలు సహకరించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకారం అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నరసింహారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నీరుకొండ సత్యనారాయణ, ధర్నాల కోట శ్రీను, సింగిలిదేవ్ సత్తిరాజు, కొండపల్లి శ్రీను, మానుకొండ లచ్చబాబు, ఎలక్షన్ డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.